# కోడర కోడర కోడర ఈ గుట్టా!

స్పాట్ వాల్యుయేషన్ కాంపులో భాగంగా పరీక్షపేపర్ల మీద కోడింగ్ జరుగుతోంది. ధన్-ధన్, ధన్-ధన్... అంటూ నంబరింగ్ మిషన్లను ధనా ధనా ఆడించేస్తున్నారు లెక్చరర్లు ఆ హాల్లో.

ప్రతి కోడ్ నంబర్నీ రెండు సార్లు అచ్చేస్తుంది ఒక మిషను. పేపరు ( లేక స్క్రిప్టు-జవాబులు రాసిన పుస్తకం) మొదటి పేజీ మీద కుర్రాడేసిన అసలు రిజిస్టరు నంబరుకు దగ్గరగా ఒకసారీ, దానికి దిగువన, దిద్దాక మార్కులేసే గళ్ళకు పక్కగా ఇంకోసారి ఈ కోడ్ నంబరు ( కొత్త నంబరు బయటి వారి ఎవ్వరికీ తెలియనిదీ, తెలిసినా ఉపయోగించనిదీ) పడుతుంది.

ముందర ఈ నంబర్లు వేసే కార్యక్రమం అయ్యాక మళ్ళీ మొదట్నించీ మొదలు పెట్టి ప్రతి పేపర్లోంచీ కుర్రాడి నంబరూ, కోడ్ నంబరూ పక్కపక్కనే ఉన్న పైభాగాన్ని చించేస్తారు. ఈ చించిన ముక్కని కౌంటర్ ఫాయిల్ అంటారు. ఇట్లా చించగా మిగిలిన కింద భాగంలో కోడ్ నంబరు మాత్రమే ఉంటుంది. కనుక ఇప్పుడు ఈ పేపరు ఏ కుర్రాడిదో ఎవ్వరూ కనుక్కోలేరు ( కౌంటర్ ఫాయిల్ లేందే). ఈ పేపరు ఇప్పుడు దిద్దే పనికై ఎగ్జామినర్ల దగ్గర కెడుతుంది. వాళ్ళు దీన్ని దిద్ది ఆ మిగిలిన దిగువ భాగంలోని గళ్ళలో మార్కులేస్తారు. ఈ మార్కులే కుర్రాడు పాసయిందీ ఫెయిలయిందీ నిర్ణయించేది.

అయితే, ఏ రిజిస్టర్డు నంబరుకు ఏ కోడ్ నంబరో తెలియబరిచే అడ్డ కాగితం పీలిక ఒకటీ, ప్రతి కోడ్ నంబరుకూ వచ్చిన మార్కుల్ని వేసేందుకు ఆ కోడ్ నంబర్ల కింద ఖాళీ గళ్ళలో ఉన్న అడ్డకాగితం పీలిక ఇంకోటీ ఒకదాని కొకటి అంటుకొనుంటాయి. మొదటిదాన్ని ' డెడ్ స్ట్రిప్' అనీ, రెండోదాన్ని 'లైఫ్ స్ట్రిప్' అనీ అంటారు. కౌంటర్ ఫాయిల్స్‌ను చించిన తర్వాత ఈ రెండు స్ట్రిప్పుల్నీ ఒక దాన్నించి ఇంకోదాన్ని వేరుచేసి ఆ పేపర్లకట్టకి 'లైఫ్ స్ట్రిప్‌ను మాత్రం తగిలించి ఆకట్లని 'న్యూక్లియర్ రూమ్' కి పంపుతారు కోడింగ్ ఆఫీసర్లు. డెడ్ స్ట్రిప్‌తో కలిపి కౌంటర్ ఫాయిల్సున్న కవరుకూడా వెడుతుంది. అక్కడ్నించి నెమ్మదిగా తన వీలేదో తాను చూసుకుని పేపర్లు దిద్దే నూట యాభై మంది ఎగ్జామినర్లలో ఏ పుణ్యాత్ముడి దగ్గరికో మర్నాటికో మూడోనాటికో వెళ్ళుతుంది ఆ పేపర్ల కట్ట. ఇంత గజిబిజిలో అంటే కోడ్ నంబర్ సిస్టమ్‌లో ఏ లెక్చరరూ కూడా తన సొంత కొడుకైనా సరే, మార్కులు వేయించుకోవటం దేవుడెరుగు, అసలెన్నొచ్చాయో, కూడా తెలుసుకోలేడు!

కోడింగు చేసే లెక్చరర్లనే కోడింగ్ ఆఫీసర్లంటారు. "సార్ సార్..." కోడింగ్ ఆఫీసరు మందరం అరిచాడు.

అప్పుడే ఎక్స్‌ప్రెస్ దిగొచ్చి కూర్చుంటూ చెమట తుడుచుకుంటున్న ఛీఫ్‌కోడింగ్ ఆఫీసరు నిష్కళంకం . "ఊఁ" అన్నాడు విసుగ్గా " సార్, ఆరుకోట్ల మూడులక్షల డెబ్బై అయిదుకూ, అదే ఆరుకోట్ల మూడులక్షల డెబ్బై ఏడుకూ మధ్యలో ఉండాల్సిన డెబ్బై ఆరు రిజిస్టరు నంబర్లేద్సార్.. డెడ్ స్ట్రిప్పులో! ఏం చెయ్యమంటార్సార్!" అన్నాడు గాబరాగా మందరం.

" ఏం చెయ్యొద్దు మిగతా పని చేసుకుపోండి!" తాపీగా అన్నాడు నిష్కళంకం

మందరం తెల్లబోయి చూస్తూ ఉసూరుమంటూ కుర్చీలో కూలబడిపోయాడు. నాలుగైదు నిముషాలు గడిచాక నిష్కళంకం వక్కపొడి వేసుకొని, కళ్ళ జోడు తుడిచి పెట్టుకుని తలెత్తి చూసేసరికి మందరం ఇంకా అదే స్థితిలో తలొంచుకొని కూర్చున్నాడు.

ఈ మారు తెల్లబోయాడు నిష్కళంకం అడిగాడు- "ఏమండీ? ఏంటీ, ఏమయింది? అట్లా కూర్చునున్నారేంటీ!"

విచారంగా అన్నాడు మందరం- "డెబ్బైఆరు లేదూ అంటే - అంటే వరసలో ఉండాల్సిన నంబరు లేదూ అంటే - ఆ కుర్రాణ్ణెవర్నో పరీక్ష రాయినియ్యలేదన్నమాటేగా! మా తమ్ముడు బెజవాడ సెంటరు పెట్టాడు వాడు కొంచెం చెయ్యి వాటం వెధవ . ఏంటో సార్, ఏమయిపోయాడో అని బెంగగా ఉంది."

పక్క కోడింగ్ ఆఫీసర్లు ఇద్దరు ముగ్గురు నవ్వారు. ఛీఫ్ నిష్కళంకం మరికాస్త తెల్లబోయాడు "మావాడు డిబార్ అయ్యాడేమో అనే నాభయం?"... "ఏడ్చినట్టుంది! అట్లాంటి కేసుంటే స్ట్రిప్పుల్లో 'దో' అని రాయాలి. అంటే దొరికాడు అని అర్థం... అసలీ డెబ్బై ఆరో నంబరువాడు పుట్టనేలేదని ఇక్కడర్థం... చాల్చాలు విచారయోగం ఆపి పని కానివ్వండి" అని అంటూ, "కొత్త వారులా ఉంది, జాగ్రత్తగా తెలీనివి తెలుసుకుని మరీ చెయ్యండి. స్పాట్ వాల్యుయేషన్ మొత్తంలో ఈ కోడింగే చాలా బాధ్యతైన పని" అన్నాడు.

పది నిముషాలు గడిచాయి. ఇంకో కోడింగ్ ఆఫీసర్ ఎందరం కంగారుగా నిష్కళంకం టేబిల్ దగ్గరకొచ్చాడు. రహస్యంగా అన్నాడు! "సార్, నా కొచ్చిన మూడు మినీ బండిల్సు( 20 పేపర్లున్న కట్టని మినీ బండిల్స్ అంటారు) లోనూ అసలు మార్కుల స్ట్రిప్పులే లేవు సార్. ఎట్లాగ?"

"మీ చుట్టుపక్కల బాగా వెతకారా?"... "వెతికాన్సార్- స్ట్రిప్పులు పోతే నన్నింటికి పంపించేస్తారాండి?" గాద్గదికంగా ఎందరం.

"ఆహా! సుబ్బరంగా!.. అయినా,ఓ మాటు 'న్యూక్లియస్‌రూమ్' కెళ్ళి కనుక్కొని రండి. రిపోర్టూ అదీ మాత్రం ఏమీరాసివ్వకండి. తర్వాత చూద్దాం."

ఎందరం బయటకెళ్ళాడు. వచ్చాడు "కట్టల్లో బాటే పారబాట్లేవీ లేకుండా చూసిస్క్రిప్టులు కూడా పంపిచార్ట సార్. అయినా చూస్తాం గంటాగి రండి అన్నార్సార్" అన్నాడు.

నిష్కళంకం పక్కనే ఇంకో ఆరుగురు ఛీఫ్‌లు కూర్చునున్నారు. ఒక్కొక్కళ్ళకిందా ఆరుగురు చొప్పున కోడింగ్ ఆఫీసర్లు మొత్తం ముప్పయ్యారు మంది ఆ హాల్లో పట్టాలి. ప్రతీ ఛీఫ్‌కూ ఎదురు గుండా ఆ తాలూకు ఆరుగురూ సాధ్యమైనంత తక్కు చోటులో సర్దుకోవాలి.

ఎందరం బయటకెళ్ళొచ్చిన ఆరగంటకి అతని పక్క వరసలో ఇంకో ఛీఫ్ కిందున్న లెక్చరరు మదనలీల బయటకెళ్ళొచ్చింది ఆ వెనుకనే న్యూక్లియస్ రూమ్ ఆఫీసరొచ్చాడు. చేత్తో ఫైల్తో వస్తూనే ఎందరం దగ్గరున్న మూడు మినీ బండిల్సూ, మదనలీల చేతిలో ఉన్న స్ట్రిప్పులూ పోర్చాడు. మదనలీలతో అన్నాడు.

"ఏమండీ బండిల్సు లేకుండా స్ట్రిప్పులొచ్చాయని మీరు రిపోర్టు ఇస్తున్నారు. స్ట్రిప్పు ల్లేకుండా బండిల్సు వచ్చాయని ఎందరం గారు రిపోర్టు ఇచ్చారు మీ దగ్గరున్న స్ట్రిప్సులు, ఆయన దగ్గరున్న బండిల్సూ ఒకే పరీక్ష సెంటరువి అసలీ బండిల్స్ తీసుకున్నది మీరు ఆయన దగ్గరకెల్లా వెళ్ళాయి?"

మదనలీల మొహం తెల్లబడిపోయింది. తేరుకుంది. మూతి తిప్పుతూ భుజాలు తిప్పుతూ నొక్కులు నొక్కుతూ అంది "ఏమో ఎల్లా వెళ్ళాయో! ఇక్కడ పెట్టాను ఎవరైనా తంతే అక్కడి కెళ్ళాయేమో!"

"అల్లా తంతే వెళ్ళే ప్రమాదం ఉందనుకున్నప్పుడు మీరు ఇటు పెట్టకూడదమ్మా అదుగో-

అటు పెట్టుకోవాలి. తీసుకోండి అయనదగ్గర్నుంచీ మీ బండిల్సు మీరు అందుకోండి'' తను కూడా నొక్కుతూ అన్నాడు ఆ అఫీసరు.

మదనలీల కోపంగా చూసింది. ఎందరం దగ్గర్నుంచి బరువందుకుంటూ సన్నగా గొణిగింది " మా ఇంట్లో కాఫీ గ్లాసులే కడగను. ఇక్కడ మాత్రం గాడిద బరువు మోయిస్తున్నారు ఏంటో!''

వెళ్లబోతున్న ఆ బట్టతల ఆఫీసరు వెనక్కోమాటు తిరిగి చూసి ద్వారం దగ్గరికి వెల్లాడు సన్నగా అన్నాడు " అన్నిటా సమాన హక్కులు కావాలి. డి ఎ లో పెచ్చు కావాలి. పనిమాత్రం తగ్గాలేం?. రేపు పెళ్లయ్యాక కష్టపడాల్సివస్తుందని పిల్లల్ని కనటం గూడా మానేస్తుందేమో ఈవిడ !'' వెళ్ళిపోయాడు.

గంట గడిచింది.

కోడ్ నంబర్లు గుద్దటం అయిపోయాక జరగాల్సిన ' స్టాంపింగ్ వెరిఫికేషన్' కోసం తమతమ కట్టల్ని నిష్కళంకం కుర్చీ చుట్టూ పేర్చారు లెక్చరరు కందరం హరాత్తుగా లేచి, అన్నాడు;

" సార్, సార్ నాది చూడండి. సార్ ముందర! అది అందరంది, సార్.''

" ఏమయితే? నేను అందరివీ చూడాల్సిందేగా! ఇదేమీ ప్రసాదం పెట్టటం కాదుగా కొందర్నొదిలెయ్యటానికి?''

తల గోక్కుంటూ అన్నాడు కందరం- " అది కాద్సార్! నేను హిందూపూర్ నుంచొచ్చాను. పైగా కొత్తగా పెళ్ళైయిన వాణ్ణి . నాలుగు డబ్బులెక్కువ చేసుకుంటే.. ఏదో సమ్మర్ హనీమూన్ గట్రా...''

" అయనకీ ఉంటాయిగా హనీమూన్!''

" వాడా! వాడొక అన్ ఫినిష్డ్ మాన్! వాడి కప్పుడే పెళ్ళేంటి సార్? ఎవరన్నా నవ్వుతారు.''

ఇద్దరు ముగ్గురు నవ్వారు. ఆఖరు కుర్చీలో ఉన్న అందరం దూసుకొచ్చేశాడు గబగబా!

" ఎవడ్రా అన్‌ఫినిష్డ్ మాన్ ? నేనా? నువ్వురా అన్‌ఫినిష్డ్ మాన్! నీ బాబురా అన్ ఫినిష్డ్ మాన్! సార్ అందర్లోనూ నన్నిట్లా ఇన్సల్ట్ చెయ్యటం వీడికిదో జబ్బయిపోయిందిస్సార్. వీడికి వెరిఫికేషన్ చేస్తే ఊరుకోన్సార్. ముందర ఇక్కడ కట్టపెట్టింది నేను! నాకు చెయ్యాలి! పట్టండ్సార్!'' అన్నాడు అందరం.

కందరం లేచొచ్చాడు. " ముందర నాకు చెయ్యాల్సార్!'' అన్నాడు . అట్లాగే అంటూ ఇంకో ఇద్దరు దూసుకొచ్చారు.

నిష్కళంకం తల తిరిగిపోయింది కోపంగా అన్నాడు . " ఏమయ్యా, మీరు లెక్చరర్లేనా! గెజెటెడ్ ఆఫీసర్లేనా! ఇంత అల్లరిగానూ పాఠాలు చెబుతూన్నారా మీమీ కాలేజీల్లో!... నో .. నా ఇష్టం వచ్చిన కట్టను వెరిఫై చేస్తాను. ఇందరంగారూ! మీరు రండి ముందర.. మిగతా వాళ్ళు వెళ్ళిపోయి పిలిచినప్పుడు రండి- ప్లీజ్ ... ఐ సే యూ వెకేట్!''

చేసేవేంలేక ఒకడి నొకడు కోపంగా చూసుకుంటూ, అందరూ అక్కడ్నించి కదలి వెల్లారు. ఇందరం వచ్చాడు. వెరిఫికేషన్ మొదలైంది. అతను డెడ్ స్ట్రిప్పు పట్టుకుని, రిజిస్టర్డు నంబరుకు కోడ్ నంబరు చదువుతూంటే ఒక్కొక్క పేపరు మీద నంబర్లనీ సరిచూస్తున్నాడు. నిష్కళంకం హరాత్తుగా " ఆగండాగండి!'' అన్నాడు. " ఒకే కోడ్ నంబర్ని ఆరు పేపర్ల మీర గుద్దేశారేంటండీ, బాబూ! ఇదిగో - ఈ రెండు పేపర్లకీ అంకెలు స్పష్టంగా పళ్ళేదు. ఇదిగో ఈ పేపరు మీద పైభాగంలో ఓ నంబరూ, క్రింద భాగంలో ఇంకో నంబరూ పడ్డాయి. మనుద్యోగాలు మన కుంచదలచుకోలేదేంటండీ?''

కంగారు పడ్డాడు ఇందరం. " అది కాద్సార్ ... మరీ నంబరింగ్ మెషినూ...''

" నంబరింగ్ మెషిన్లో ఎడ్జస్టమెంట్సుంటాయి. అవి గమనించారా! అయినప్పటికీ పాడయి పోయిందనుకుంటే న్యూక్లియస్ రూమ్ కెళ్ళి మార్చుకోకపోయారా!"

హఠాత్తుగా మందరం ఓ మినీ బండిలు పట్టుకొచ్చాడు. అన్నాడు : " సార్, ఇందులో ఒక నంబరుకి స్క్రిప్టులేదు ఒక స్క్రిప్టుకినంబర్లేదు. స్టిప్పులో ఆఖరి నంబరేమో రెండుకోట్ల తొంభైలక్షల మూడువేల ఒకటి. కనక ఈ నంబర్లేని స్క్రిప్టుకి నేనే ' ఒకటీ -ఏ' అని కోడ్ తగిలించేసి గుద్దేద్దా మనుకుంటున్నాననుకోండి. మరి నంబరుండి స్క్రిప్టులేదుకదా- ఆ నంబర్ని ఏం చెయ్యమంటారు?"

నిష్కళంకానికి మొదట్లో అర్థంకాలేదు. తలెత్తి చూసి చూసి మొహం మీద చెమట తుడుచుకున్నాడు. నెమ్మదిగా అన్నాడు. " మీరు సగౌరవంగా ఇంటికెళ్ళదలచుకున్నారా?"

" హె, హె, అదేంటి , సార్! సగౌరవంగానే వెడతాను." అయితే, మీరు ఎంత ముచ్చట పడ్డప్పటికీ, అంకెలు ఎంత అందంగా కనిపించినప్పటికీ, స్టిప్పులో నంబర్లు లేని స్క్రిప్టులు ఎన్నొచ్చినప్పటికి ... బాబూ , దయచేసి సొంత నంబర్లెప్పుడూ ఇవ్వకండి!" బ్రతిమాలాడు నిష్కళంకం.

విసుక్కున్నాడు మందరం : " మరయితే ఏం చెయ్యమంటారండీ !"

ఏం చెయ్యాలో మీకు టైపు కొట్టిచ్చాం- స్టిప్పులో నంబర్లు లేని స్క్రిప్టుల్ని అన్నింటిని న్యూక్లియస్ రూమ్‌కి రిటర్న్ చెయ్యండి. స్టిప్పుల్లోనూ 'తె' అంటే తెలీదు - అని గుర్తించండి. బాబూ. ఇట్లాంటి దేదైనా వస్తే ఇట్లాగే అడుగుతూండు నాయనా!"

"సర్లెండి!" విసురుగా మందరం వెళ్ళిపోయాడు. అక్కడే నుంచునున్న ఇందరాన్నిచూస్తూ నిష్కళంకం అన్నాడు: " ఎక్కడున్నాం మనం?"

"గోదాట్లో! సారీ గోదావరి ఊళ్ళోసార్!"

జోడు లోంచి చూవాడు నిష్కళంకం. " తెలివిగలవాడవే! నీ పని ఎంతవరకొచ్చింది. అని అడుగుతున్నాను."

" అదా? ఆగిపోయిందిగదండీ! పోనీ ఓ పనిచేస్తే సార్? ఈ తప్పులు పడిపోయిన కట్ట అంతా తీసుకెళ్లి న్యూక్లియస్ రూమ్‌లో కామ్‌గా వెనక్కి అప్పజెప్పేస్తే?"

" మంచివాడివే రేపు మళ్ళీ నీకే అప్పగించి సరిచేసిమ్మంటారు. ఓ రోజు పడుతుంది. జలుబు వదుల్తుంది!... వెళ్ళండి. అన్ని స్క్రిప్టులూ మళ్ళీ చూసి సరిచేసి తీసుకురండి!"

నిష్కళంకం ఇంకో కట్టేదో వెరిఫై చేస్తున్నాడు. తప్పు దొరికింది. " కోడింగ్ ఆఫీసర్ నంబర్ ఫోర్, ఎందరం గారూ, రండి", అన్నాడు. ఎందరం వచ్చాడు బిక్క మొహంతో.

నిష్కళంకం అన్నాడు " ఏమయ్యా క్రింది భాగంలో మార్కులేయాల్సిన గళ్ళలో నంబరు గుద్దేశారు. ఒకటికాదు, రెండు కాదు , ఇరవై స్క్రిప్టులకూ అదే గతి పట్టించారు ఎట్లా?" నొచ్చుకుంటూ అన్నాడు ఎందరం! " అరెరె, పొరబాటయిపోయింది,సార్, అనెక్స్‌పెక్టెడ్, సార్, అనింటెన్షనల్, సార్, ఎక్స్‌క్యూజ్ మీ సార్, ఫీలింగ్ వెరీ మచ్, సార్...."

" ఆపండాపండి బాబూ, ఆపండి! మీ బాధ అర్థమయింది. నాబాధే మీ రింకొంచెం అర్థంచేసుకోవాలి ఆ దిద్దే ఎగ్జామినరు మార్కులెక్కడేస్తాడో, ఎక్కడెయ్యాలని మీ రనుకుంటున్నారో కాస్త చెప్పి పుణ్యం కట్టుకోండి."

" సారీ చెప్పాను గద్సార్? పోనీ ఆ ఎగ్జామినర్ గారి క్కూడా వెళ్ళి సారీ చెప్పుకొంటాన్సార్... ఏదో

ఈ మాటుకు పోనీండి, సార్!" ..." ఎగ్జామినర్‌కి సారీ చెబుతారా? ఏ ఎగ్జామినర్‌కి? ఈ మినీ బండిల్ సూటాయాభయి మందిలో ఎవరిచేతిలో కెడుతుందో మీకు తెల్సా!"

గోళ్ళు కొరుక్కుంటూ కంగారుగా అన్నాడు ఎందరం. " అయితే, ఏం చెయ్యగలం,సార్, ఇప్పుడు? పడిన నంబరు తుడి చెయ్యలేం గదండీ!"

" మనం తుడిచెయ్యలేం. కానీ, ఎగ్జామినర్ వేసే ఎఱ్ఱ సిరా అంకెలు తుడిచేస్తాయి. కనక తమరు దయచేసి ఈ గళ్ళ ప్రక్కనే మళ్ళీ గుద్ది తీసుకురండి."

కట్ట తీసుకుని దిగాలు పడుతూ ఎందరం వెళ్లిపోయాడు.

హఠాత్తుగా సన్నని కూని రాగం వినిపించింది " కోడద కోడర కోడర ఈ గుట్టా,

చింపర చింపర చింపర ఫాయిల్సట్ట... " అందరూ వెనక్కి చూసి నవ్వారు. నిష్కళంకరావు విసురుగా లేచి వెళ్ళాడు. అందరం దగ్గర ఏమిటీ హుషారుగా ఉంది వ్యవహారం!" అన్నాడు.

హుషారుగానే జవాబిచ్చాడు అందరం " ఇది సార్, ఈ గుట్ట కాస్తా కోడ్ చేసేసి, ఫాయిల్స్ చింపేసేసి, మీ చేత వెరిఫై చేయించేసేసి న్యూక్లియస్ రూములో అప్పజెప్పేసేసి, ఇవతలకొచ్చేశానంటే ఈ రోజుకి నాలుగొందలవుతుంది. అంటే అరవై రూపాయలాదాయమన్నమాట!... మీరు కొంచెం సహకరించాలంతే!"

" సవ్యమైన సహకారం నా దెప్పుడూ ఉంటుంది... మరి మీ సహకారం మాటేంటి?... మీకు బోయ్ నిచ్చింది అక్కడ్నించిక్కడికి కట్టలు తెచ్చి పెట్టటానికి. నాడి చేత కౌంటర్ ఫాయిల్స్ చింపించటానిక్కాదు. అట్లా చింపించటం నేరం. కాంపు ఛీఫ్ చూస్తే సమృద్ధిగా పోస్తాడు అక్షింతలు పోస్తాడు మనిద్దరి నెత్తినాను!... ఒరేయ్, చింపటం ఆపెయ్యరా, నీపని చూసుకో పో!"

" సార్ సార్, ప్లీజ్... కొంచెం కో-ఆపరేట్ చెయ్యండి. సార్! నాకు పెళ్ళి కాకపోయినా పెళ్ళయినా అమ్మా, నాన్నా ఇంకా చెల్లెళ్ళూ ఉన్నార్సార్ ..." బతిమాలాడు అందరం.

అంతా మళ్ళీ ఫక్కున నవ్వారు.

" సారీ! నువ్వు లేచిపోతావా పోవురా?"

ఆ కుర్రాడు లేచిపోయాడు. నిష్కళంకం వెనక్కి తిరిగాడు. సన్నగా కూనిరాగం వినిపించింది. " కలకల్ల ఆయెగా, కోరిక మిగిలెనుగా, సాటిలేని రీతిగా, మదినెంతో బాధగా!"

మళ్లీ అంతా నవ్వారు. రెండో కుర్చీలో ఉన్న లెక్చరరుకొందరంతో అవతల ప్రక్క అమ్మాయి తీక్ష్ణంగా అంటోంది. " నా స్కేలు తీసుకున్నందుగ్గాదు నాబాధ. నేనడగ్గానే దాంతో వీపు గోక్కొనిచ్చారు. ఇదేమన్నా బాగుందా" కొందరం అన్నాడు : " వీపు పేలిందీ, గోక్కున్నాను .. అయినా నిన్న మీరు నా స్కేలు తీసుకుని నేనడగంగానే మీరు కాలు గోక్కుని ఇచ్చారు. అంతకన్నా చెడిందా ఇది.."

" నిన్న నేను కావాలని చెయ్యలేదు... సర్లెండి. ఇంకెప్పుడూ అడక్కుండా నావస్తువులు ముట్టుకోకండి!" ... నిష్కళంకం టైము చూసుకున్నాడు కొందరం వైపు చూస్తూ అన్నాడు. " డియర్ సర్స్, గంట మాత్రమే టైముంది. కబుర్లు మానేసి పని చెయ్యండి. ఇవాళ్టి పని ఇవ్వాళే సావకాశంగా పూర్తి చేసి వెళ్ళండి అది మనందరకి ఆరోగ్యకరం."

అంతా నిశ్శబ్దమైపోయింది.

★ ★ ★

మందరం కోడింగ్ చేసేసి. వెరిఫికేషన్ చేయించుకొని. చింపి. కవర్లలో పెట్టించిన కౌంటర్ ఫాయిల్స్‌ని లెక్క పెడుతున్న నిష్కళంకం టక్కున ఆగిపోయాడు "మందరం గారు" అని పిలిచాడు.మళ్లీ మళ్లీ పిలువగా విసుక్కుంటూ వచ్చాడు మందరం "ఏంటి సార్ ఏనాపు చేసొచ్చా చెప్పండి "! అన్నాడు

" చూండండి, కౌంటర్ ఫాయిల్స్‌తో బాటుగా ఈ కవర్లో మీరు లైవ్ స్ట్రిప్ పెట్టారు కాని, డెడ్ స్ట్రిప్ పెట్టాలి. స్ట్రిప్సేమో పేపర్ల కట్టలో కెళ్లింది అంటే దిద్దే ఎగ్జామినర్‌కు ఏ కోడ్ నంబర్‌కు ఏది అసలు రిజిస్టర్డ్ నంబరో తెలిసిపోతుంది. ఇట్టా పెడితే ఎట్లాగా. తియ్యండి, పేపర్ల కట్టవిప్పి స్ట్రిప్పులు మార్చండి.

" ఒక్క స్ట్రిప్పే గద్సార్ తప్పుగా వెళ్లింది! ఈ మాత్రానికే అంతా వెల్లడై పోతుందా. నా కిది అరగంట పన్సార్!"

" డెడ్ స్ట్రిప్పు మీద ఖాళీ గళ్లుండవు గదయ్యా ! ఏ ఎగ్జామినర్ మార్కులెక్కడెక్కిస్తాడు.. అబ్బబ్బ! ..తియ్యండి.. తీసి మార్చండి.!

"నాన్ సెన్స్! ది సీజ్ డాంకీ సర్వీస్ సర్! చస్తే ఇంకెప్పుడూ కోడింగ్‌కు రాన్సార్ "

" లక్షణంగా వెతుక్కుంటూ మరీ వస్తారు డబ్బు సంపాదించటానిగ్గాని,దేశానికేదో కంట్రిబ్యూట్ చేయాలనికాదుగా మీరు లెక్చరర్ అయ్యింది! అ డబ్బే మిమ్మల్ని లాకొచ్చింది. తియ్యండి తియ్యండి!"

విసుక్కుంటూ కట్టలుతీసి కెలికి స్ట్రిప్పులు మార్చాడు మందరం

ఇంకో పావుగంట టైంవుందనగా హడావిడిగా వచ్చాడు అందరం "సార్, నా కౌంటర్ ఫాయిల్స్ కవరిస్తారా న్యూక్లియస్ రూములో ఇస్తాను.. ఇవాల్టికి పనయిపోయింది! కష్టపడి సాయంగా నేనే చింపి తెచ్చి పెట్టాను సార్" అన్నాడు

" ఆగండి, లెక్క పెడుతున్నవి మీవే." అంటూ కొంచెం వేగంగా లెక్కపెడుతూ టక్కున ఆగిపోయాడు నిష్కళంకం. " ఇందులో ఇరవై ఉండాల్సింది, ఇరవై మూడున్నాయేంటి!" అన్నాడు. "ఒక్కొక్కటి విడమర్చి లెక్క పెట్టాడు. " కొంప ముంచారండీ ! మీరు చింపవలసింది రిజిస్టర్డు నంబరున్న పైపేజీ పైభాగం మాత్రమే. కానీ, మీరు ఇదిగో ఈ స్క్రిప్టులో ఒకపేజీ కూడా కలిపి చింపేశారు. అంటే వాళ్లు రాసిన సమాధానాల్లో కొంత భాగం అసలు వాల్యుయేషన్‌లోకి వెళ్లదన్నమాట! మీ హడావిడి పాటలూ ఎంత పన్చేశాయో చూశారా!"

" ఆఁ - పోనిద్దురూ - ఎవడు చూడొచ్చాడు!" .. " ఏంటీ, ఎవడు చూడొచ్చాడా!.. ఆ కుర్రాళ్ళు మీ తమ్ముళ్ళే అయితే? . ఈ అధికంగా చింపిన ముక్కల్ని ఆయా స్ట్రిప్పుల్లోకి పిన్నులు గుచ్చి తగిలించండి. పేపర్ల కట్ట విప్పండి!"

విసుగ్గా మొహం పెట్టాడు అందరం " ఇప్పుడెల్లాగండి? పేపర్లకట్ట న్యూక్లియస్ రూముకు వెళ్ళిపోయింది "

ఆశ్చర్యపోయాడు నిష్కళంకం " ఎట్లా వెళ్ళింది? నేను ఓ కే చేశానా?". " రిజిస్టర్లో ఇందాక సంతకం పెట్టించుకున్నారు గదండీ!".. "హడావిడిగా సంతకం పెట్టించేశారన్నమాట నాచేత! వెళ్ళండి , ఆ కట్ట వెనక్కి తీసుకొచ్చి ఈ పని సక్రమంగా చేస్తేనే గాని ఈ కవర్ని ఓ కే చెయ్యను!"

గింజుకుంటూ. రంజుకుంటూ అందరం వెళ్ళాడు పావు గంటలో ఆ పని పూర్తయింది

టైమయింది అందరూ గది బయటికి నడిచారు గేటు దాటి వెళ్ళబోతున్నారు ప్యూను పరుగెత్తుకుంటూ వచ్చాడు " సార్ ఫస్టు స్క్వాడ్ ఛీఫుమీరేనా? మీ బల్లల కింద ఊడుస్తూంటే స్వీపరుకి కౌంటర్ ఫాయిలు దొరికిందట న్యూక్లియస్‌రూము కాడి కెళ్ళి మీకోడింగు అఫీసర్లియ్యాలిచ్చిన కట్టలూ

కవర్లు అయ్యన్నీ బయటికి తీసి అది ఏ కవరు తాలూకుదో చూసి ఆ కవర్లో పెట్టాలంట. ఎంత రాత్రయినా సరే ఈ పని చేసి మరీ వెళ్లాలంట. అందుకని మీ ఆరుగురు కోడింగాఫీసర్లని పంపించమని మీకు చెప్పమన్నారు అయ్యగారు. ఆకర్న ఎల్లిపోయేటప్పుడు కౌంటరు పాయిలు లూజుగా ఎందుకు ఇంత పడిపోయిందో ఆ ఫలానా అఫీసర్ గారు రాసివ్వాలంట కూడాను" అన్నాడు

స్కూటరెక్కబోతూన్న అందరం పెంకెగా, "ఇవ్వాళే చెయ్యాలా, టైమయిపోయాక ?. రేపు చేస్తాం" అన్నాడు ....." ఇయ్యాల చెయ్యకపోతే రేపు రిలీఫిచ్చి ఇంటికి పంపేత్తారంట మీ ఇట్టం!" ప్యూను వెళ్ళిపోయాడు.

టక్కున స్కూటరు దిగాడు అందరం మందరం, కందరం,ఇందరం, ఎందరం, కొందరం- అందర్నీ తలా ఒక స్థితిలో ఉన్న వాళ్ళని పోగు చేశాడు తుమ్మల్లో పొద్దుగూకినట్టున్న మొహాల్తో ఆ ఆరుగురూ న్యూక్లియస్ రూము వైపు కదిలారు

నిట్టూర్చి, కదిలి బస్సెక్కాడు నిష్కళంకం

(ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక 20 8-85)

* * *    * * *    * * *

# వారెవా వడ్డాణమా !

స్ప్రింగ్ డోర్ లోసుకుని లోపలికి నడిచాడు బాంకాఫీసర్ భూపతి లోపలున్న బాంక్ మేనేజర్తో " సార్, వడ్డాణం విడిపించుకోవటానికి పార్టీ వచ్చాడు. మీ రొక సారొస్తారా?" అన్నాడు.

మేనేజర్ సింహశౌర్యం చేతుల్లోంచి ఫైలు అప్రయత్నంగా జారి టేబిలుమీది కొరిగింది. అతను అన్నాడు. "నేనిక్కడ చార్జీ తీసుకుని వారం కూడా కాలేదు. అప్పుడే గోల్డు లోను కేసేంటి ! పది రోజుల తరవాత రమ్మను. కావలిస్తే డబ్బు కట్టెయ్యమను."

" ఆ వచ్చింది కాలేజీ లెక్చరరు గారు సార్ నా(ఫ్రెండు. ఇప్పటికే రెండు మూడు సార్లు తిరిగెళ్లేడే" అన్నాడు భూపతి సింహశౌర్యం తన తల పట్టుకున్నాడు. కళ్లు మూసుకున్నాడు. నుదురు నొక్కుకున్నాడు అసహనంగా అటూ ఇటూ కదిలాడు కాలింగ్ బెల్ నొక్కాడు అటెండర్ రాగానే మంచినీళ్లు తెమ్మన్నాడు. అతను తెచ్చాడు. ఇంత సేపూ భూపతి డోర్ దగ్గరే నుంచున్నాడు సింహ శౌర్యం ఆ నీళ్లు తాగలేదు. నీరసంగా భూపతి వైపు చూస్తూ " మాట, ఇటొచ్చి కూర్చో" అన్నాడు.

పరిస్థితేంటో అర్థం కాలేదు భూపతికి వెళ్లి సింహశౌర్యానికెదురుగా కూర్చున్నాడు

సింహశౌర్యం అన్నాడు : " చూడుబాబూ, ఏదో ఆ అడ్వాన్సు, ఈ అడ్వాన్సూ అయితే ఫరవాలేదు. కానీ, ఈ గోల్డులోనుంచే, ఇది తలకొరివి, ఇదంటే నా కసలు ఎలర్జీ. దీని పేరు వింటేనే నాకు ఒళ్ళు జలదరిస్తుంది. ముచ్చెమటలు పోస్తాయి మా అమ్మా నాన్నా జ్ఞాపకం వస్తారు. నాభార్య పిల్లలూ నాకళ్ళముందు తారట్లాడుతారు. బాబూ, ఏ గోల్డుకి ఎవరు అసలు యజమానులో తెలుసుకోవటానికి అంటే ఊళ్ళో వాళ్లతో పరిచయం అవటానికి నాకో పది రోజులు పడుతుంది. అప్పటి దాకా గోల్డు లోను